# ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

• మలక్‌పేట, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో అంబరాన్నంటిన సంబురాలు • దేవాలయాల్లో పూజలు



భక్తులతో కిక్కిరిసిన ఆరె మైసమ్మ దేవాలయం



ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు కొలన్ సుభాశ్‌రెడ్డి, జాలిగం చిత్తారి

మైలార్‌దేవ్‌పల్లి/బండ్లగూడ/అత్తాపూర్/మలక్‌పేట/చాదర్‌ఘాట్, జనవరి 01: మలక్‌పేట, రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో నూతన సంవత్సరానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. డిసెంబర్ 31 సాయంత్రం నుంచే న్యూ ఇయర్ వేడుకలు ప్రారంభించి అర్ధరాత్రి 12 గంటలకు 2023కి గుడ్‌బై చెప్పి 2024కు స్వాగతం పలికారు. సోమవారం రాజేంద్రనగర్, బుద్వేల్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, నార్సింగి, మణికొండ, శంషాబాద్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్, శంషాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలంతా నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. డిసెంబర్ 31 నుంచే మద్యం కొనుగోళ్లు చేపట్టారు. వైన్ షాపుల ముందు భారీ ఎత్తున క్యూ కట్టి మద్యాన్ని కొనుగోలు చేశారు. నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పరిధిలోని రిసార్ట్‌లు, వ్యవసాయ క్షేత్రాలు, రెస్టారెంట్లలో నూతన సంవత్సర వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహకులు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. మద్యం సేవించి రోడ్లపైకి వచ్చిన వారిని ఆపి వారిపై కేసులు నమోదు చేశారు.

### టీఎన్‌జీవోస్ కాలనీలో వెంకన్నగుట్ట వేంకటేశ్వరుడికి లక్ష పుష్పార్చన

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీలోని వెంకన్నగుట్ట వేంకంటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు.

### భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా సోమవారం ప్రజలంతా దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. పలు దేవాలయాల వద్ద భక్తులు ఉదయం నుంచే దర్శనం కోసం క్యూ లైన్లలో వేచి ఉన్నారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, బండ్లగూడ, పిరం చెరువు, బుద్వేల్, కిస్మత్‌పూర్, హైదర్షాకోట్ తదితర ప్రాంతాల్లోని దేవాలయాల వద్ద భక్త సందోహం కనిపించింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో ఆరె మైసమ్మ ఆలయం కిక్కిరిసింది. అమ్మవారిని దర్శించుకుని నూతన సంవత్స రంలో శుభాలు జరగాలని కోరుకున్నారు.



నల్గొండ చౌరస్తాలో నూతన సంవత్సర కేక్ కట్ చేస్తున్న సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రోహిత్‌రాజ్, పాల్గొన్న పోలీస్ అధికారులు

### క్రిష్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో ప్రార్థనలు

క్రైస్తవులంతా బైబిల్ విశ్వాసాలను పాటిస్తూ పేదలకు సాయం చేయాలని క్రిష్టియన్ లైఫ్ సెంటర్ చర్చి పాస్టర్లు ఇమ్మాన్యుయేల్, ప్రభుచరణ్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా లక్ష్మీనగర్‌లోని క్రిష్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని వారు ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు స్వీట్లు, క్యాలెండర్లను పంపిణీ చేశారు. క్రిష్టియన్ మత పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు

మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డికి సోమవారం అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కొలన్ సుభాశ్‌రెడ్డి, జే.చిత్తారి ఆధ్వర్యంలో సబితాఇంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

### నూతన సంవత్సర కేక్ కట్ చేసిన సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రోహిత్‌రాజ్

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా సోమవారం సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రోహిత్‌రాజ్ స్థానిక నల్గొండ చౌరస్తాలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సౌత్‌ఈస్ట్ జోన్ పోలీస్ అధికారులు, ఏసీపీ శ్యాంసుందర్, చాదర్‌ఘాట్ సీఐ వై.ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీఎన్‌జీవోస్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు



లక్ష్మీనగర్‌లోని క్రిష్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో భక్తులనుద్దేశించి ప్రసంగిస్తున్న పాస్టర్ ఇమ్మాన్యుయేల్

## అయ్యప్పస్వామి పడిపూజ



మలక్‌పేట, జనవరి 1 : మూసారాంబాగ్ శాలివాహననగర్‌లోని శాలివాహన దవాఖాన వద్ద సోమవారం డాక్టర్ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సతీశ్‌కుమార్ దంపతులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, బెక్కం వెంకట్, అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటింటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ

మణికొండ/అత్తాపూర్, జనవరి 01: అయోధ్య రామాలయ అక్షింతలను రామభక్తులు సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఇంటింటి పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. నార్సింగి, మణికొండ, శంషాబాద్, బండ్లగూడ మున్సిపాలిటీల పరిధిలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలను, కాషాయ ధ్వజం, కరపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామభక్తులకు మహిళలు మంగళహారతులు పట్టి భక్తులు ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో రామభక్తులు, హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో

అయోధ్య రామమందిరం నుంచి తెచ్చిన అక్షింతలు సోమవారం అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని ఇంటింటికీ పంపిణీ చేశారు. హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో సభ్యులు ఉదయం భజన, భక్తిగీతాలు ఆలపిస్తూ ఊరేగింపు నిర్వహిస్తూ అక్షింతలు పంచి పెట్టారు.



హైదర్‌గూడలో అక్షింతల ఊరేగింపులో పాల్గొన్న ప్రణవ భక్త సమాజం సభ్యులు

### అయోధ్య అక్షింతలు ఊరేగింపు

సైదాబాద్ : అయోధ్య అక్షింతలను ఐఎస్ సదన్ డివిజన్‌లోని బృందావన్ కాలనీ, నాగార్జున కాలనీ, వైశాలినగర్ కాలనీలో సోమవారం ఊరేగించారు.కార్యక్రమంలో ఐఎస్ సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు, పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్, తదితరులు


శంషాబాద్ రూరల్, జనవరి 1 : శంషాబాద్ మున్సిపాలిటీ ముదిరాజ్ సంఘం, పెద్దమ్మతల్లి ఆలయం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ ఆవిష్కరించారు. శంషాబాద్ టౌన్ అధ్యక్షుడు బొబ్బిలి మనోజ్‌ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం క్యాలెండర్..



తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ, సైదాబాద్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మినారాయణ, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్‌గుప్తా, సైదాబాద్ అధ్యక్షుడు నెరెళ్ల ప్రసాదరావుగుప్తా, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. – సైదాబాద్, జనవరి 1

## సీఎంకు శుభాకాంక్షలు



చాదర్‌ఘాట్,జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం కాంగ్రెస్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ అక్బర్ కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 57 మందిపై కేసులు

బండ్లగూడ/మలక్‌పేట, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు పలు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 57 మందిపై కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్ ఆధ్వర్యంలో అదివారం రాత్రి 9 గంటల నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు ఆరాంఘర్, అత్తాపూర్, అజీజ్‌నగర్, దుర్గానగర్ ప్రాంతాల్లో ఆర్ఐ నరసింహ, ఎస్ఐలు రాజేందర్, బాసిత్ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ద్విచక్ర వాహనదారులు 40 మంది, ఇద్దరు ఆటోవాలాలు, కార్లు నడుపుతున్న 15 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ బోస్‌కిరణ్ తెలిపారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

### మలక్‌పేట పరిధిలో.. 53 మందిపై..

డిసెంబర్ 31ని పురస్కరించుకొని మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు దిల్‌సుఖ్‌నగర్‌లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 53 మంది వాహనచోదకులు పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేశారు. పట్టుబడిన వాహనాల్లో 48 ద్విచక్రవాహనాలు, 5 కార్లు ఉన్నాయని మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎన్.చంద్రశేఖర్ తెలిపారు. తనిఖీల్లో ట్రాఫిక్ ఎస్ఐలు రాము, యాదయ్య, రామస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. ఏసీపీ సత్యనారాయణ తనిఖీలను పర్యవేక్షించారు.

## రేపు మంచినీటి సరఫరాలో అంతరాయం

సైదాబాద్, జనవరి 1 : కృష్ణా వాటర్ సప్లై ఫేజ్–1 పరిధిలోని సంతోష్‌నగర్ వద్ద పైపులైన్ జంక్షన్ పనులకు మరమ్మతులు చేపడుతున్నందున బుధవారం మలక్‌పేట, సంతోష్‌నగర్ సర్కిళ్ల పరిధిలో తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు జలమండలి సైదాబాద్ డివిజన్ మేనేజర్ శ్రవణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైదాబాద్, ఆస్మాన్‌ఘడ్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ, యాకుత్‌పురా, మాదన్నపేట, మహబూబ్ మాన్షన్, రియాసత్‌నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఉండదని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.